


జాయింట్ కలెక్టర్‌గా మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్


మౌర్య భరద్వాజ్

రాష్ట్ర ప్రభుత్వం ఐఎఎస్ అధికారులను వివిధ శాఖలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం 30 మంది ఐఎఎస్ అధికారులను వివిధ శాఖలకు బదిలీ చేశారు. ఇందులో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఏపీ మారి టైం బోర్డు ఈఓగా బదిలీ అయ్యారు. ఈయన గత ఏడాది జిల్లాకు వచ్చి జిల్లా అభివృద్ధిలో తన వంతు కృషి చేశారు. ప్రస్తుతం శ్రీసత్యసాయి జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా కర్నూలు జిల్లా ఆదోని సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న మౌర్య భరద్వాజ్ నియమితులయ్యారు. రెండు రోజుల్లో ఈయన బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

అనంతలో ఐద్వా సాంస్కృతిక ఉత్సవాలు ప్రారంభం

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

ఆలోచింపజేసిన ఫొటో ప్రదర్శన

మహిళా సమానత్వంతో సమాజాభివృద్ధి

సినీ దర్శకులు ఉమామహేశ్వరరావు

సాంస్కృతిక ఉత్సవం.. చైతన్య భరితం..!





మహిళా శక్తిపై విద్యార్థిని ఉద్యమ నినాద ప్రదర్శన


విద్యార్థిని కర్ర సాము

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) సాంస్కృతిక ఉత్సవం చైతన్యభరితంగా ప్రారంభం అయ్యింది. అనంతపురం జిల్లాలో ఈ నెల 13,14,15వ తేదీల్లో జరగనున్న ఐద్వా రాష్ట్ర మహాసభల నేపథ్యంలో గురువారం నుంచి నగరంలోని కృష్ణ కళామందిరంలో సాంస్కృతిక ఉత్సవాలు అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి. తొలి రోజు ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభం అయ్యింది. సమాజంలో మహిళ వివక్ష.. వేధింపులు.. దాడులు.. వరకట్న దురాచారం తదితర వాటిని తెలియజేస్తూ ఫొటోలను ప్రదర్శించారు. మహిళలు సాధించిన అభివృద్ధి, వారి ఫొటోలను సైతం ప్రదర్శించారు. సాంస్కృతిక ఉత్సవాల్లో మహిళలు, విద్యార్థినులు ప్రదర్శన చేశారు. కోలాటం.. కర్రసాము, భరతనాట్యం తదితర కళాప్రదర్శనలు కొనసాగాయి. సాంస్కృతిక ప్రదర్శన ఆద్యంతం చూపరులను కట్టిపడేసింది.

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 16వ రాష్ట్ర మహాసభలు ఈ నెల 13 నుంచి మూడు రోజుల పాటు అనంతపురంలో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం అనంతపురం జిల్లా కేంద్రంలోని కృష్ణకళామందిరంలో సాంస్కృతిక ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. నాలుగు రోజుల పాటు సాగే కళా సాంస్కృతి ఉత్సవాలు, ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవ సభ నిర్వహించారు. తొలుత ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను స్నేహలత నర్సింగ్ హోం అధినేత్రి డాక్టర్ అరుణ ప్రారంభించారు. అనంతరం కళా సాంస్కృతిక ఉత్సవాలను సినీ దర్శకులు ఉమా మహేశ్వరరావు, అనంతపురం జిల్లా రెవెన్యూ అధికారి మలోల ప్రారంభించారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకురాలు సరళ అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభ కార్యక్రమంలో ఉమా మహేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

మహిళా సమానత్వంతో సమాజాభివృద్ధి

స్త్రీ పురుషులు సమానంగా గుర్తిస్తూ వారికి సమాన హక్కులు కల్పించినప్పుడే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని సినీ దర్శకులు ఉమా మహేశ్వరరావు తెలియజేశారు. ఆధునిక మహిళ చరిత్రను తిరగరాస్తుందని అనాడే గురజాడ అప్పారావు చెప్పారన్నారు. ప్రజా సంస్కృతినే ప్రత్యామ్నాయంగా నిలబెట్టుకోవాల్సిన సమయం ప్రస్తుతం ఏర్పడిందన్నారు. ప్రతి ఒక్కరూ వారి కుటుంబంలో ఆడ మగ అన్న తేడాలేకుండా పిల్లలను సమానంగా పెంచి సమాన హక్కులు కల్పించాలన్నారు. మహిళలు చైతన్యవంతంగా మరింత ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు.



మాట్లాడుతున్న ముఖ్య అతిథి సినీ దర్శకులు ఉమా మహేశ్వరరావు

రాజకీయం, సంస్కృతి రెండు ఒక్కటే అన్నారు. రెండింటిని అర్థం చేసుకుని మహిళలు ముందుకు సాగాలన్నారు. సమానత్వాన్ని ప్రతిభింబించే సినిమాలు ఎన్నో వచ్చాయని వాటిని ఆదరించాల్సిన అవసరం ఉందన్నారు.

◆ అనంతపురం డిఆర్‌ఒ మలోల మాట్లాడుతూ సమాజానికి మహిళా సాధికారత ఎంతో అవసరం అన్నారు. ఎన్ని చట్టాలున్నా నేటికీ మహిళలపై వివక్ష, అత్యాచారాలు, దాడులు చోటు చేసుకోవడం విచారకరం అన్నారు. ఐద్వా లాంటి సంఘాలు మహిళల హక్కుల కోసం పోరాడుతూ చైతన్యం కల్పిస్తుండటం అభినందనీయం అన్నారు. మహిళల హక్కుల రక్షణకు చట్టాలు అమలు చేయడంలో జిల్లా యంత్రాంగం అండదండగా నిలుస్తోందన్నారు.

◆ స్నేహలత నర్సింగ్ హోం అధినేత్రి డాక్టర్ అరుణ మాట్లాడుతూ ఐద్వా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ఎంతో ఆలోచింపచేసేలా ఉందన్నారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారని తెలిపారు. లలిత కళాపరిషత్ కార్యదర్శి పద్మజ మాట్లాడుతూ సమాజంలో మహిళల పక్షాన ఐద్వా చేస్తున్న పోరాటం ఆదర్శనీయం అన్నారు. ఇలాంటి చైతన్య కళా ప్రదర్శనలు సమాజానికి ఎంతో దోహదం చేస్తాయని తెలిపారు.

◆ ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మాట్లాడుతూ ఐద్వా 16వ రాష్ట్ర మహాసభలు ఈ నెల 13, 14, 15 తేదిలలో నిర్వహిస్తున్న నేపథ్యంలో నేటి నుంచి 12వ తేది వరకు చైతన్య సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కళా ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో గేట్స్ కళాశాల అధినేత్రి పద్మావతి, డాక్టర్ ప్రసూన్, డాక్టర్ ప్రగతి, యుటిఎఫ్ నాయకురాలు దేవేంద్రమ్మ, ప్రమీళ, రాష్ట్ర నాయకులు రమణయ్య, ఐద్వా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్యామల, చంద్రిక, నగర కార్యదర్శి అశ్విని, జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, క్రిష్ణమూర్తి, ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్, ఎస్‌ఎఫ్ఐ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.


కోలాటం ఆడుతున్న చిన్నారులు


ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మహిళా వైద్యులు, ప్రముఖులు



ఆటకట్టుకున్న ప్రదర్శన


ప్రదర్శనలను సెల్‌ఫోన్లో బంధిస్తున్న యువత

ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యసేవలు మెరుగవ్వాలి

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్


విసిలో పాల్గొన్న కలెక్టర్, జెసి

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏపీ సచివాలయంలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి గురువారం సాయంత్రం సానుకూల ప్రజా దృక్పథం, ఏజెంట్ కోసం డాక్యుమెంట్ అప్‌లోడ్, జిఎస్‌డబ్ల్యూఎస్ 3 అంచెల నిర్మాణం, సీజనల్ వ్యాధులు, మందుల సరఫరా, ఆసుపత్రుల్లో పారిశుధ్యం, రీ అసెస్మెంట్ ఆఫ్ పెన్షన్లు తదితర అంశాలపై కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయనంద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. పుట్టపర్తి కలెక్టరేట్లోని వీసీ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జేసి అభిషేక్ కుమార్, వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. విసి అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ఎంతో శ్రద్ధ చూపుతోంది. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారిశుధ్యం పక్కాగా అమలు చేయాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. డెంగ్యూ, డయేరియా వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. ప్రభుత్వ వసతి గృహాలలో నాణ్యమైన ఆహారం, నీరు, మెరుగైన పారిశుధ్యం ఉండాలన్నారు. వికలాంగుల పెన్షన్లకు రీ అసెస్మెంట్ కు దరఖాస్తు చేసుకున్న వారందరికీ ప్రతివారంలో బుధ గురు శుక్రవారాల్లో వికలాంగత్వ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. జిఎస్‌డబ్ల్యూఎస్ కార్యాలయాలను మరింత బలోపేతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ సూర్యనారాయణ రెడ్డి, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆగిన ఆర్‌టిసి అద్దె బస్సులు

ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం

డ్రైవర్లకు అండగా సిఐటియు

ప్రజాశక్తి-హిందూపురం

కడప జిల్లా ఆళ్లగడ్డ డిపోకు చెందిన అద్దె బస్సు డ్రైవర్ మహమ్మద్‌ను గుడిపాడు వద్ద కె.హేమవర్ధన్ అనే వ్యక్తి రాయితో తలపై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడికి నిరసనగా గురువారం శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా అద్దె బస్సు డ్రైవర్లు నిరసనకు దిగి, బస్సులు నిలిపివేశారు. దీంతో హిందూపురం డిపోలో ఉన్న 35 బస్సులతో పాటు శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా 119 అద్దె బస్సులు ఒక్క సారిగా ఆగాయి. దీంతో వివిధ ప్రాంతాల ప్రయాణికులు సకాలంలో బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒక్క సారిగా బస్సులను నిలపి వేయడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు పడుతారని, మీ సమస్యలను పరిష్కరిస్తామని డిఎం శ్రీకాంత్ డ్రైవర్లకు సూచించినప్పటికి డ్రైవర్లు ససేమిరా అన్నారు. విషయం తెలుసుకున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్ పి శ్రీనివాసులు, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరి, జంగాలపల్లి పెద్దన్న, సిఐటియూ పట్టణ కన్వీనర్ రాములు అక్కడికి చేరుకొని డ్రైవర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతు స్టేజీ లేకపోయినా ఆపమని అడిగితే డ్రైవర్ ఆపలేదని దాడి చేయడం దారుణమన్నారు. అద్దె బస్సు డ్రైవర్లపై జరిగే దాడుల గురించి డిపో అధికారులు, బస్సుల యజమానులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. అద్దె బస్సు డ్రైవర్లకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అద్దెబస్సు డ్రైవర్లను ఆర్‌టిసి డ్రైవర్లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని స్వాగతిస్తున్నామని, అందుకు తగ్గట్లు నూతన బస్సులను ప్రవేశ పెట్టాలని కోరారు. డ్రైవర్లు మాట్లాడుతు బస్సు పరిమితి 55 సీట్లు ఉంటే 70 నుంచి 80 మంది వరకు ప్రయాణికులు ఉంటారని దీంతో పాటు హిందూపురం-అనంతపురం మధ్యలో 11స్టేజిలు ఉంటే అదనంగా మరో 15 నుంచి 20 స్టేజీలు ఉంటాయని చెప్పారు. ఈ నేపథ్యంలో బస్సులకు మైలేజీలు ఎక్కడి నుంచి వస్తాయన్నారు. అర్‌టిసి అధికారులు తమకు ఏమి సంబంధం లేదని చెప్తారని అయితే చిన్న తప్పు చేసిన చర్యలు మాత్రం తీసుకొంటామని వేధిస్తారని అన్నారు. ఈ మధ్యనే కర్నూలు జిల్లా ఆత్మకూరు వద్ద ఆర్టీసీ డ్రైవర్ పై దాడికి పాల్పడ్డారని, పెనుకొండ వద్ద బస్సు ఆపక పోవడంతో డ్రైవర్‌పై ప్రయాణికులు తీవ్ర దుర్భాషాలాడుతున్నారని అన్నారు. తమకు భద్రత కల్పించేంతవరకు బస్సులు తీయమన్నారు.

ఇబ్బందులు పడిన ప్రయాణికులు : హిందూపురం డిపోలో 35 అద్దె బస్సులు, 55 ఆర్‌టిసి బస్సులు ఉన్నాయి. ఒక్క సారిగా 35 బస్సులు ఆగిపోయాయి. దీంతో ప్రదానంగా హిందూపురం-కదిరి, హిందూపురం-అనంతపురం, హిందూపురం-ధర్మవరం తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు బస్సులు లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణంలో పూర్తి స్థాయిలో కుర్చీలు లేక పోవడంతో బయట అరుగు మీద చంటి బిడ్డలను కుర్చోబెట్టుకొన్నారు. వృద్దులు ఎక్కువ సేపూ నిలబడక వారి బ్యాగుల మీద ఎండలోనే కుర్చొన్నారు. ఇదే విధంగానే శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా ఒక్క సారిగా 119 అద్దె బస్సులు ఒక్క సారిగ ఆగిపోవడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పోలీసులతో బాధితుల వాగ్వాదం

న్యాయం చేయలేదంటూ సిఐ, ఎస్ఐని నిలదీత

ప్రజాశక్తి-సోమందేపల్లి

తమకు న్యాయం చేయలేదని మండల పరిధిలోని వెలగమాకులపల్లికి చెందిన ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన రెండు కుటుంబాలకు చెందిన వ్యక్తులు వేర్వేరు సమస్యలపై గురువారం పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసుల తీరుపై సిఐ రాఘవన్, ఎస్ఐ రమేష్‌బాబును నిలదీశారు. ఈసందర్భంగా బాధితులు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. గ్రామానికి చెందిన కృష్ణా నాయక్ ఈ ఏడాది ఏప్రిల్‌లో ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో మృతిచెందాడు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు, కొందరు పెద్దమనుషులు కలసి తమకు న్యాయం చేయకుండా ఆరు నెలలుగా ఇబ్బందులు కలిగిస్తూ అవతలి వ్యక్తికి రక్షణ కల్పిస్తున్నారని మృతుని దేవి బాయ్, కుటుంబసభ్యులు విమర్శించారు. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన అశ్వర్థ నాయక్ భార్య ఆ గ్రామంలో మరో వ్యక్తి మాయమాటలు నమ్మి ఇంట్లో ఉన్న బంగారు, నగదు తీసుకువెళ్లిందని గత నెల తొమ్మిదో తేదీన ఫిర్యాదు చేసినా అతనిపై చర్యలు తీసుకోకుండా తమపైనే పోలీసులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఆరోపణలపై ఎస్ఐ రమేష్ బాబు వివరణ ఇచ్చారు. ట్రాక్టర్ ఢీకొని చనిపోయిన కృష్ణా నాయక్‌కు సంబంధించిన కేసును నమోదు చేసి ఛార్జిషీట్‌ను కూడా దాఖలు చేశామన్నారు. ఈ కేసు కోర్టులో జరుగుతుందని వారు తనపై అపార్థంతో కోర్టులో తానే ఆలస్యం చేస్తున్నట్లు మాట్లాడుతున్నారని తెలిపారు. అదేవిధంగా అశ్వర్థ నాయక్ భార్య తాను ఎవరితోనో వెళ్లిపోలేదని కేవలం తన భర్త ప్రవర్తన సరిగా లేక ఆయనకు దూరంగా ఉన్నానని పోలీస్ స్టేషన్లో రాతపూర్వకంగా ఆమె తెలియజేసిందన్నారు. దీంతో కేసు నమోదు చేయకుండా వారిద్దరినీ పిలిపించి పలుమార్లు కౌన్సిలింగ్ కూడా ఇచ్చామని ఈ విషయంలో కూడా బాధితులు అపార్థంతో తనపై అనవసరమైన అబాండాలు వేస్తున్నారని ఎస్ఐ చెప్పారు.

ఆదుకోండి సార్..!

ఎస్‌బిఐ ముందు ఖాతాదారుల నిరసన

ప్రజాశక్తి-హిందూపురం

ఎంతో కష్టపడి సంపాదించి బ్యాంకులో దాచుకున్న నగలు, నగదు అందించి ఆదుకోవాలని ఖాతాదారులు విజ్ఞప్తి చేశారు. గురువారం హిందూపురం రూరల్ మండల పరిధిలోని పారిశ్రామిక వాడ లో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందు ఖాతాదారులు నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల సంబంధిత బ్యాంకులో దోపిడీ జరిగి దుండగులు నగదు, తాకట్టు, లాకర్ లో పెట్టిన నగలు దోచుకెళ్లారు. అయితే అప్పట్లో బ్యాంకు ఉన్నతాధికారులు ఖాతాదారులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగదని భరోసా ఇచ్చారు. అయితే ఇప్పటివరకు నగలు ఇవ్వకపోవడంతో కార్మిక సంఘం నాయకులు రవికుమార్ ఆధ్వర్యంలో ఖాతాదారులు నిరసనకు దిగారు. బ్యాంకు దోపిడీ జరిగిన సమయంలో బాధితుల సొమ్ము 15 రోజులలోపు చెల్లిస్తామని బ్యాంకు అధికారులు చెప్పారని మూడు నెలలు కావస్తున్నా బాధితుల సొమ్ము చెల్లించడం లేదన్నారు. ఇప్పటికైనా బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించి ప్రస్తుతం పెరిగిన బంగారు ధరకు అనుగుణంగా బాధితులకు నగదు చెల్లించాలని, లేకపోతే దశల వారీగా నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఖాతాదారులు పాల్గొన్నారు.

జిల్లాలో 751.2 మిల్లీమీటర్ల వర్షపాతం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

శ్రీ సత్య సాయి జిల్లాలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి 751.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు గణాంకాల అధికారి తెలిపారు. రాత్రి 7:30 నుంచి గురువారం ఉదయం ఏడు గంటల వరకు వర్షం కురుస్తూనే ఉంది. ఉరుములు మెరుపులతో పలు మండలాల్లో భారీగా వర్షం కురిస్తే మరికొన్ని మండలాల్లో ఒక మోస్తారుగా వర్షం కురిసింది. జిల్లాలో 32 మండలాలకు గాను ఏడు మండలాలు మినహా మిగతా అన్ని మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా గోరంట్ల మండలంలో 118.2 మి. మీ బత్తలపల్లి 84.8, సోమందేపల్లి 64.8, నల్లమాడ 61.4, అమరాపురం 48.8, పెనుకొండ 44.6, కొత్తచెరువు మండలంలో 41.2, మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. అత్యల్పంగా రొళ్ళ మండలంలో 2.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.



ఓఎంసీ హద్దులకై కమిటీ

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

సరిహద్దులు తేల్చాలని సుప్రీంకోర్టు ఆదేశాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



అనంతపురం జిల్లా సరిహద్దు డీ.హీరేహళ్ మండలంలో ఇనుప ఖనిజం అక్రమాలు నిగ్గు తేల్చేందుకు సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కమిటీని వేసింది. ఈ మేరకు గురువారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. కర్నాటక, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లోని డీ.హీరేహళ్ మండలం ఓబుళాపురం గ్రామం పరిధిలో ఇనుప ఖనిజం గనులుండేవి. ఈ గనుల్లో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని ఆరోపణలొచ్చాయి. అనంతరం దీని యజమాని గాలి జనార్ధన్‌రెడ్డితోపాటు అనేక మందిపై సిఐబి కేసులు నమోదు చేసింది. ఈ కేసు విచారణ ఇంకా కొనసాగుతూనే ఉంది. ప్రధానంగా పక్కపక్కనే ఉన్న గనుల్లో అక్రమంగా తవ్వకాలు జరిగినట్టు ఆరోపణలు న్నాయి. అదికూడా రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో అటువైపు, ఇటువైపు గనులున్నాయి. ఈ సరిహద్దులను చెరిపేసి ఓబుళాపురం మైనింగ్ కార్పొరేషన్ సంస్థ పెద్దఎత్తున అక్రమ తవ్వకాలు జరిపిందన్నది అభియోగం. దీనిపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు రిటైర్డు జస్టిస్ సుదన్షు దుల్హాయి నేతృత్వంలో కమిటీని వేసింది. ఆయన ఆధ్వర్యంలో తోడ్పాటును అందించేందుకు రాష్ట్రస్థాయిలో నిపుణులను ఆ కమిటీలో నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం నాడు ఉత్వర్వులు జారీ చేసింది.

జస్టిస్ సుదాన్షు దుల్హాయి ఈ కమిటీకి ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. మొత్తం ఆరుగురు సభ్యులతో ఈ కమిటీ ఉంటుంది. కేంద్ర అటవీ పర్యావరణ శాఖ నుంచి కేంద్ర ప్రభుత్వం ఒకరిని నామినేట్ చేస్తుంది. సెంట్రల్ ఎంపవర్డు కమిటీ నుంచి ఒక నామినీ ఉంటారు. అనంతపురం డిఎఫ్ఒ గరుప్రభాకర్ ఒకరు సభ్యులుగా ఉంటారు. సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ నుంచి డైరెక్టర్ ఒకరు సభ్యులుగా ఉంటారు. భూగర్భ గనుల శాఖ జాయింట్ డైరెక్టర్ డి.శ్రీనివాసరావు సభ్యులుగా ఉంటారు. అనంతపురం జిల్లా కలెక్టర్, ల్యాండ్ సర్వే నుంచి కర్నూలు ఆర్‌జెడి వెంకటేశ్వర్లు సహాయ, సహకారాలందిస్తారు. ఇలా ఈ కమిటీ రెండు మాసాల్లో గనుల లీజులతోపాటు, వాటి సరిహద్దులు తేల్చడం, అందులో మైనింగ్‌లో జరిగిన అవకతవకలేమైనా ఉంటే గుర్తించి సుప్రీంకోర్టుకు నివేదికను అందజేస్తారు.



గతంలో సుప్రీంకోర్టు చర్యలు

గతంలోనే సరిహద్దులు తేల్చేందుకు సర్వే ఆఫ్ ఇండియాకు ఆదేశించింది. 2010లో ఇది జరిగింది. మైనింగ్ సరిహద్దులు గుర్తించి నివేదికను కోరింది. ఇందులో ఓవర్‌ల్యాపింగ్ స్కెచెస్‌లో ఉన్నట్టు గుర్తించారు. ఆ తరువాత ఆంధ్రప్రదేశ్, కర్నాటక సరిహద్దులను గుర్తించేందుకు ఆదేశించింది. 2023లో ఈ కేసును గ్రీన్ బెంచ్‌కు బదిలీ చేసింది. తాజాగా ఇప్పుడు గనుల సరిహద్దులు సరిగాలేవని, మైనింగ్ అక్రమాలు జరిగాయన్న దానిపై ఇప్పుడు రిటైర్డు జస్టిస్ దుల్హాయి అధ్యక్షతన కమిటీని వేసింది. ఈ కమిటీ రెండు మాసాల్లోపు నివేదికను సుప్రీంకోర్టుకు అందజేయాల్సి ఉంటుంది.

మహిళా సాధికారతే ధ్యేయం : మంత్రి సవిత



ర్యాలీలో పాల్గొన్న మంత్రి సవిత, కలెక్టర్ శ్యాంప్రసాద్, తదితరులు

ప్రజాశక్తి - గోరంట్ల

కూటమి ప్రభుత్వం మహిళా పక్షపాతి అని , మహిళా సాధికారతే ధ్యేయంగా పనిచేస్తున్నామని రాష్ట్ర చేనేత జౌళి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవితఅన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఐసిడిఎస్ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వెయ్యి మంది విద్యార్థినులతో నిర్వహించిన ర్యాలీని మంత్రితో పాటు కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బాలికలు, మహిళలు ఏదైనా అనుకుంటే సాధించగలమని అన్నారు. ఎంతోమంది మహిళలు ఉన్నత స్థాయి పదవుల్లో ఉన్నారన్నారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మహిళలకు ఆస్తిలో భాగం కల్పించడం జరిగిందన్నారు. అదే స్ఫూర్తితో ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళల సాధికారతకు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఆడపిల్ల చదువుకుని ఉన్నతస్థాయిని అధిరోహించాలన్నారు. అంతకు ముందు కలెక్టర్ విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. విద్యార్థినిలు తమకు క్రీడా మైదానం లేదని తెలుపగా కలెక్టర్ స్పందించి క్రీడా మైదానం మంజూరుకు హామీ ఇచ్చారు. ఈసందర్భంగా విద్యార్థినులు చేసిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ ప్రమీల, డిపిఒ సమత, తహశీల్దార్ మారుతి ప్రసాద్, ఎంపీడీవో కమలాబాయి, ప్రధాన ఉపాధ్యాయులు బి ఈశ్వర ప్రసాద్, కన్వీనర్ బాలకృష్ణ చౌదరి, రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సోమశేఖర్, నాయకులు నరేష్, పచ్చ అశోక్, నాగే నాయక్, సింగల్ విండో అధ్యక్షులు చంద్ర, రమణ, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిఎస్‌టిపై అవగాహన : మండల కేంద్రంలో ఏరియా హాస్పిటల్‌లో "సూపర్ జిఎస్‌టి – సూపర్ సేవింగ్స్" అవగాహన కార్యక్రమంలో మంత్రి సవిత, కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైద్య పరికరాలపై జీఎస్టీ రేట్లు గణనీయంగా తగ్గాయన్నారు. ఈ నిర్ణయం వల్ల ఆసుపత్రులు తక్కువ వ్యయంతో ఆధునిక వైద్య పరికరాలు కొనుగోలు చేయగలుగుతాయన్నారు. దీని ఫలితంగా చికిత్స సేవలు మరింత తక్కువ ధరకే ప్రజలకు అందుతాయని తెలిపారు. అనంతరం మంత్రి, కలెక్టర్ ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. రోగులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అల్తాఫ్, వినోద్, సునీల్, కూటమి నాయకులు, మెడికల్ స్టోర్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో గురువారం సమాజంలో బాలికల హక్కులు వారి ప్రాముఖ్యత తదితర అంశాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ నాగరాజు నాయక్, కుళ్లాయప్ప, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, ఎపిఎం సువర్ణమ్మ, మహిళా పోలీసులు అంగన్వాడీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లచెరువు : బాల్య వివాహాలపై నల్ల చెరువులో గురువారం అంగన్వాడీ సిబ్బంది జెడ్ పి హెచ్ స్కూల్ విద్యార్థులు స్వచ్ఛంద సేవ సంస్థ ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ తిరుపాల్ నాయక్ ,ఎంపీడీవో రామకృష్ణ, జడ్పీహెచ్ హై స్కూల్ పిడి షఫీ, ప్రధానోపాధ్యాయులు లక్ష్మీదేవి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

తలుపుల : అంతర్జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకొని గురువారం తలుపుల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు దీప, అలివేలమ్మ అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పరిగి : అంతర్జాతీయ బాలిక దినోత్సవం పురస్కరించుకొని గురువారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పరిగి మండల కేంద్రంలో జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ లలితమ్మ, ఎంఇఒ లక్ష్మీదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యరాజ్, ఏవో అశ్వర్థప్ప, మండల కన్వీనర్ ఎస్ఎన్ గోవింద్ రెడ్డి, మండల అభివృద్ధి కమిటీ సభ్యులు సూర్యనారాయణ, బాలాజీ, సంజీవరాయప్ప, అంగన్వాడీలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి మండల స్థాయి లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ బాలికా దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ ని గణేష్ కూడలి నుండి కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా పుట్టపర్తి మండలం టీడీపీ కన్వీనర్ విజయకుమార్ ఎంఇఒ ప్రసాద్ ఏపీఎం,లక్ష్మీనారాయణ , ఏవో రమణారెడ్డి, స్వచ్ఛంద సేవ సంస్థ ప్రతినిధి సునీత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సుజాత, మంజుల, భగవతి,రేణుక, అనిత ఎనుములపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఫీ, విశ్రాంత ఉపాధ్యాయుడు వెంటకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : ఆడపిల్లలను రక్షించుకోవడం, చదివించుకోవడం మన బాధ్యత అని వక్తలు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని కస్తూరి బా గాంధీ పాఠశాల, ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మునిసిపల్ చైర్మన్ డీఈ రమేష్ కుమార్, టూ టౌన్ సీఐ అబ్దుల్ కరీం, ఐసిడిఎస్ సిడిపిఒ వరలక్ష్మి పాల్గొన్నారు. .ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.


రొద్దం : పిల్లలను రక్షిద్దాం వారిని చదివిద్దామని అధికారులు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థుల చేత ఐసిడిఎస్ సూపర్వైజర్ అనురాధ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రొద్దం ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీనారాయణమ్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్ అనురాధ, అంగన్వాడీ కార్యకర్తలు ఆసిన, అరుణ, నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

నదిలో ట్రాక్టర్ బోల్తా

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

మండల పరిధిలోని ఇరగంపల్లి సమీపంలో వంగ పేరు నదిలో మొక్కజొన్న బస్తాలు వేసుకుని వెళుతున్న ట్రాక్టర్ బోల్తాపడింది. నదిపై కొత్తగా నిర్మించిన కాజ్వే పై రైతు మొక్కజొన్నలను ఆరబోశాడు. వర్షం వచ్చే సూచన కన్పించడంతో ఆరబోసిన మొక్కజొన్నలను సంచుల్లో వేసుకుని ట్రాక్టర్‌ద్వారా వంగపేరు నది దాటుతున్న సమయంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడింది. తోటి రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో జెసిబి సాయంతో ట్రాక్టర్‌ను డ్రైవర్‌ను ఒడ్డుకు చేర్చారు. బుధవారం రాత్రి ఎగువ ప్రాంతాలైన పెనుగొండ, సోమందేపల్లి, మండలాల్లోరాత్రి కురిసిన వర్షాలకు వంగ పేరు నది వరద ఉధృతి పెరగడంతో ట్రాక్టర్ బోల్తా పడిందని దీంతో పంట మొత్తం నదిలో పడి కొట్టుకుపోయిందని బాధిత రైతు వెంకటేష్ వాపోయారు. ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్న మొత్తం నీటి పాలు కావడంతో తీవ్రంగా నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశాడు.



వాగులో నుంచి ట్రాక్టర్‌ను లాగుతున్న దృశ్యం

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - తనకల్లు

మండల పరిధిలోని ఎన్‌హెచ్–42 రహదారిపై ఎస్ఐ గోపీ తన సిబ్బందితో కలసి గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి ఈ–చలాన్లు విధించారు. అదేవిధంగా హెల్మెట్ యొక్క ప్రాముఖ్యతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. రహదారికి ఇరువైపులా ప్రయాణికులకు, ద్విచక్ర వాహనదారులకు, ఇబ్బందికరంగా రోడ్డుపైకి పెరిగి ఉన్న ముళ్ల పొదలను జె.సి.బి సహాయంతో దగ్గరుండి తొలగింప చేశారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

మండలంలోని సంగటివారి పల్లి మాజీ ఎంపీటీసీ మల్లికార్జున కుమారుడు అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మండల కన్వీనర్ ముబారక్ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి రూ. 20 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి నారాయణరెడ్డి, యూనిట్ ఇన్‌ఛార్జి రామాంజులు, రఘునాథ్ రెడ్డి, అమర్నాథ్, భార్గవ నాయుడు, రాజారెడ్డి, బూత్ కన్వీనర్ నారాయణ, కుమార నాయుడు, రంగాని, వెంకటరమణ, అలీ, హాస్పిటల్ మాజీ అభివృద్ధి కమిటీ చైర్మన్ భార్గవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణం తనిఖీ

ప్రజాశక్తి - లేపాక్షి

మండల కేంద్రంలోని 14వ చౌకధాన్యపు డిపోను తహశీల్దార్ గురువారం తనిఖీ చేశారు. రేషన్ దుకాణంలో తొమ్మిది రోజులుగా నిత్యావసర సరుకులు పంపిణీ చేయకుండా లబ్ధిదారులను తిప్పుకుంటున్నారన్న ఫిర్యాదులు రావటంతో రెవెన్యూ అధికారులు గురువారం తనిఖీ చేశారు. రేషన్ డీలర్‌పై వచ్చిన ఫిర్యాదులు వాస్తమమేనని తమ విచారణలో తేలాయని విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రమీలమ్మ, విఆర్ఒలు రాజేష్, సుమిత్ర, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయం : టిడిపి

ప్రజాశక్తి - నల్లమాడ

రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టిడిపి స్థానిక నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, మండల కన్వీనర్ మైలే శంకర్, బాబా వలి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని వైసిపి నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకలు మణికుమారి, మైలే రామచంద్ర, దారమేని కేశవ, నరసింహులు, పాపారాయుడు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి - కదిరి అర్బన్

పొగాకు నియంత్రణలో భాగంగా స్థానిక కుటాగుల్ల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. పొగాకు వాడితే కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. ఈ విషయాలను పిల్లలు తమ తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ మార్చాలని వినతి

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి రూరల్ మండలం కరావులకుంట వద్ద ఉన్న విద్యుత్ నియంత్రికను మరో ప్రదేశానికి మార్చాలని ఎపి రైతుసంఘం నాయకులు కోరారు. ఈ మేరకు వారు ట్రాన్స్‌కో డిఇకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండల కార్యదర్శి బడా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ కరావుల కుంట వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుకు సమీపంలో ఉందన్నారు. దీంతో ప్రమాదం పొంచి ఉందన్నారు. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను మరో చోటికి మార్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఆంజనేయులు,ఉదయ్, బాబ్జాన్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



డిఇకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శ్రీ కృష్ణదేవరాయల వర్థంతిని అధికారకంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీకృష్ణదేవరాయల వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని చరిత్రకారుడు మైనా స్వామి కోరారు. అక్టోబర్ 17న వర్ధంతిని అధికారికంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్‌ను విజయవాడలో ఆయన కార్యాలయంలో కలసి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు స్పందించిన ఆయన విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి వర్ధంతిని అధికారికంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

'సాధన'లో ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణంలోని సాధన స్కూల్‌లో నిర్వహించిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. విద్యార్థులు తమ సృజనాత్మకతను, కల్పనాశక్తిని వినియోగించి అద్భుతమైన క్రాఫ్ట్‌లు, చిత్రాలు, మోడల్స్ రూపొందించారు. పేపర్, మట్టి, వుడ్, వధా వస్తువులతో రూపొందించిన కళా కృతుల్లో సృజనాత్మకత కన్పించింది. ఈసందర్భంగా చైర్మన్ సాధిక్, కరస్పాండెంట్ గౌస్ విద్యార్థులను అభినం దించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రదర్శనను తిలకిస్తున్న కరస్పాండెంట్, తదితరులు

చెట్లను కాపాడుకుందాం

ప్రజాశక్తి - కొత్తచెరువు

బాలుర స్థానిక బాలుర పాఠశాల హెడ్మాస్టర్ గోపాల్ అధ్యక్షతన పర్యావరణం పై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భాస్కర్ నాయుడు, ఎంఈఓ సోమశేఖర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చెట్ల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కల్చర్ అండ్ నేచర్ డెవలప్మెంట్ సంస్థ నేషనల్ సభ్యులు కమలకొండ సంతోష్, ఐసిడిఎస్ అధికారి కొండసాని రజిత , అధ్యాపకులు అనంతలక్ష్మి, విశ్వేశ్వరయ్య, త్రిమూర్తులు, రామమూర్తి, పిడి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

కాంగ్రెస్ పార్టీనాయకులు తుంపర్తి పరమేష్ ఆధ్వర్యంలో ధర్మవరం పట్టణంలో గురువారం ఓట్ చోర్– గద్దె చోడ్ కార్యక్రమంలో భాగంగా ప్రజలనుండి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం లక్ష్యలాది అక్రమ ఓట్ల చేర్పు ప్రక్రియను దిగ్విజయంగా నడిపిస్తోందని విమర్శించారు. ప్రజలకు రాహుల్ గాంధీ అండగా నిలిచి రాజ్యాంగాన్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు.

క్రమశిక్షణ ముఖ్యం

ప్రజాశక్తి - కొత్తచెరువు

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని అప్‌గ్రేడ్ సిఐ మారుతి శంకర్ తెలిపారు. చైతన్య పాఠశాలకు వెళ్తున్న విద్యార్థినులను ఆయన పలకరించి పలు విషయాలపైన అవగాహన కల్పించారు మహిళలు చట్టాల గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. మహిళల పైన దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. అలాగే కొత్త చెరువులో నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించి వాటిని అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. బంగారు షాపులో ఉన్న యజమానులను తప్పనిసరిగా దుకాణాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

గర్భిణులకు పౌష్టికాహారం

ప్రజాశక్తి - తలుపుల

మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్యశాలలో రూరల్ డెవలప్మెంట్ ఫ్రెండ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గర్భిణులకు గురువారం పౌష్టికాహారం అందజేశారు. ఈసందర్భంగా ట్రస్ట్ సభ్యులు మన్సూర్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల నుండి తలుపుల వైద్యశాలకు ప్రతి నెల 9వ తేదీన గర్భిణులు చెకప్ కోసం వస్తున్నారన్నారు. ఈసందర్భంగా వారికి ఈ భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై డాడి అమానుషం : సిపిఎం



విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి ఆర్ గవాయ్ పై జరిగిన దాడిని అమానుషమని సిపిఎం జిల్లా నాయకులు అన్నారు. ధర్మవరంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ న్యాయమూర్తిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దేశ ప్రధాన న్యాయమూర్తిపైకే మతోన్మాదులు దాడులకు బరి తెగిస్తుంటే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. సిజెఐపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్‌హెచ్ బాషా, నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయి పై దాడిని ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని ఎంఇఎఫ్ నాయకులు నాగేంద్ర పేర్కొన్నారు. ఈ దాడిని మాదిగ ఉద్యోగుల సమైక్య తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇది కేవలం ఓ వ్యక్తిపై జరిగిన దాడి కాదని న్యాయ వ్యవస్థపై జరిగిన దాడి అని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోతులయ్య, శ్రీనివాసులు, గూనివాండ్ల రాజు, మున్సిపల్ కార్మికులు సూరి, శ్రీరాములు, గంగాద్రి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

జెవివి ఆధ్వర్యంలో 'చెకుముకి' పరీక్షలు

ప్రజాశక్తి - రొళ్ల

జెవివి ఆధ్వర్యంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు శాస్త్రీయ, వైజ్ఞానిక అంశాలపై పోటీ పరీక్షలు నిర్వహించారు.జన విజ్ఞాన వేదిక ప్రతి ఏడాది రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల్లో శాస్త్రీయ చైతన్యం, ఆవిష్కరణా భావన, పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించేందుకు ఈ "చెకుముకి సైన్స్ సంబరాలు" కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఇందులో విద్యార్థులు శాస్త్రీయ మోడల్‌లు, క్విజ్‌లు, ప్రాజెక్టులు, వ్యాసాలు వంటి విభాగాల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా ఎంఇఒ భాస్కర్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో సృజన్మాతక పెంపొందుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో ఎంఇఒ భాస్కర్, నరసింహమూర్తి, డి మారుతీ ప్రసాద్,జెవివి. జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, రమేశ్, మంజునాథ్, ఉమేష్, నాగార్జున, ఉపాధ్యాయులు వెంకటరమణ నాయక్, రామకృష్ణ, ప్రభాకర్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకేంద్రంలో యూనిట్ ప్రారంభం

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సుమారు 50 లక్షల రూపాయల తో నూతనంగా నిర్మించిన ప్రజా ఆరోగ్య బ్లాక్ యూనిట్‌ను మంత్రి సవిత స్థానిక తెలుగుదేశం కూటమి నాయకుల కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పర కార్పొరేషన్ చైర్మన్ వెంకట్రాముడు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డివి ఆంజనేయులు, మండల కన్వీనర్ వెంకటేష్, టౌన్ కన్వీనర్ వడ్డే సూరి, పార్లమెంట్ కార్యదర్శి నీరుగంటి చంద్ర, మాగే చెరువు సర్పంచి నరసింహమూర్తి, జనసేన మండల కన్వీనర్ జేబీవుల్లా మాజీ ఎంపీటీసీ కిష్టప్ప, నాయకులు పెద్ద కోటిపల్లి నరసింహమూర్తి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం సచివాలయం వద్ద ధర్నా



ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు, నాయకులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి రూరల్ మండలంలోని కుమ్మరవాండ్లపల్లి పంచాయతీ హమాలి కోటర్స్‌లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో ఆ కాలనీ మహిళలు ఖాళీ బిందెలతో సచివాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు సాంబశివ మాట్లాడుతూ హమాలీ క్వాటర్స్ లో సుమారు 500 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు . ఈ కాలనీలో పంచాయతీ బోరు చెడు పోయి వారం రోజులవుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి, సర్పంచి వెంటనే స్పందించి చెడిపోయిన బోరును రిపేరు చేయించాలని డిమాండ్ చేశారు. తక్షణమే నీళ్ల ట్యాంకులు ఏర్పాటు చేయాలన్నారు. స్పందించిన అధికారులు ,ప్రజాప్రతినిధులు హమాలి కోటర్స్‌కు వాటర్ ట్యాంకులు పంపి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నారాయణ, దివాకర్ నాయక్, హరి నాయక్, గణేష్ నాయక్, శ్రీనివాసులు, కాలనీవాసులు కాంతమ్మ, భారతి, పుష్పావతి, లక్ష్మీదేవి, శ్రీదేవి భాయ్, షాహినా, సుమియా, మహేశ్వరి, లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లపై చర్యలు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - పరిగి

మండల వ్యాప్తంగా అనధికారంగా వేస్తున్న లేఅవుట్లపై కొరడా ఝులిపిస్తామని డిప్యూటీ ఎంపీడీవో విజయభాస్కర్ తెలిపారు. అనధికార లే అవుట్లపై ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు డిప్యూటీ ఎంపిడిఒ ఎర్రగుంట పంచాయతీ పరిధిలో 96 సర్వేనెంబర్ పరిధిలో2.50 ఎకరాలలో వేసిన అనధికార లేఅవుట్ యజమానికి గురువారం నోటీసు జారీ చేశారు. ఈ వారం రోజుల్లో లేఔట్ కు సంబంధించి పత్రాలతో వస్తే అనుమతులు ఇస్తామని లేకపోతే తొలగించి నోటీస్ బోర్డును లేఔట్ లో పెడతామని హెచ్చరించారు. స్థానిక సెక్రటరీలకు అనధికార లే అవుట్లపై అప్రమత్తంగా పనిచేయాలని ఆయన తెలిపారు. ప్రజల సైతం ఇలాంటి అనాధికారాలు లేఔట్లలో స్థల విక్రయాలు జరపవద్దని సూచించారు.

షూటింగ్ బాల్ పోటీల్లో 'రిషి' విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

షూటింగ్ బాల్ పోటీలలో స్థానిక రిషి విద్యాలయం విద్యార్థులు సత్తా చాటిందని ఆ పాఠశాల డీన్ భాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న ఎస్ వి. సిరి, వై.శాలిని, పి. షణ్ముఖ కుమార్ రెడ్డి రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. గత నెల 25, 26వ తేదీలలో కర్నూలులో నిర్వహించిన రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొన్న వీరు సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. తమ పాఠశాలలో చదువుతోపాటు క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధను చూపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ కరణ్ స్వరూప సింగ్, సిఎఒ రవీంద్ర, వైస్ ప్రిన్సిపల్ కళ్యాణి, ఏవో రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సహకార విధానంపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని కోడిగేనహళ్లి ఎన్జైట్ డిగ్రీ కళాశాలలో జాతీయ సహకార విధానం- 2025 పై అవగాహన కార్యక్రమాన్ని డివిజనల్ సహకార అభివృద్ధి కమిటీ సభ్యులు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి ఆర్. కృష్ణానాయక్ మాట్లాడుతూ జాతీయ సహకార నూతన విధానం గ్రామీణ అభివృద్ధికి, ఉపాధి సృష్టించడానికి ఉపయోగపడుతుందన్నారు. దేశవ్యాప్తంగా కళాశాల విద్యార్థులను, యువతను సహకార రంగంపై మళ్లించి ఆర్థిక పురోగతి సాధించడానికి దోహదపడుతుందని తెలిపారు. హిందూపురం డివిజనల్ సహకార అధికారి అదినారాయణ మాట్లాడుతూ యువత సహకార సంస్థలు స్థాపించి ఆర్థిక పురోగతి సాధించాలన్నారు. నేటి విద్యార్థులు రేపటి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజనల్ సహకార అధికారి నారాయణమూర్తి, అసిస్టెంట్ రిజిస్టర్ రాగసుధా, జూనియర్ ఇన్స్పెక్టర్లు ఎన్ఆర్. జయమ్మ, కే వెంకటరెడ్డి, హెచ్ శ్రీరాములు, టౌన్ బ్యాంక్ మేనేజర్ ఎస్ నారాయణ స్వామి, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి - మడకశిర టౌన్

అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో జరుగుతున్న పలు నేరాలను పూర్తిస్థాయిలో నియంత్రిస్తామని ఎస్పీ సతీష్ కుమార్ స్పష్టం చేశారు. గురువారం మడకశిర అప్ గ్రేడ్ , రూరల్ సర్కిల్ పోలీస్ స్టేషన్లో, మడకశిర పరిధిలో ఉన్న అమరాపురం , రొళ్ల, అగళి, గుడిబండ పోలీసు స్టేషన్లను ఎస్పీ తనిఖీ చేశారు. రికార్డులు, లాకప్ గదులు , కమాండ్ కంట్రోల్ రూమ్, మహిళా హెల్ప్ డెస్క్ ,స్టేషన్ యొక్క పరిసరాలు, పట్టుబడిన వాహనాలను పరిశీలించారు. అనంతరం మడకశిర పోలీస్ స్టేషన్లో ఎస్పీ మీడియాతో మాట్లాడారు. కర్నాటక రాష్ట్రానికి సరిహద్దుల్లో ఉన్న మడకశిర ప్రాంతంలో ఎలాంటి నేరాలకు అవకాశం ఉంది,క్షేత్రస్థాయిలో వాటికి గల కారణాలను విశ్లేషించి, ఆయా నేరాలను అరికట్టడానికి పక్కా ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. త్వరలోనే తగిన ప్రణాళిక సిద్ధం చేసి, అంతర్రాష్ట్ర నేరాలు నియంత్రణపై పూర్తి అవగాహనతో పోలీసు అధికారులకు, సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇస్తామన్నారు. మడకశిర పట్టణంలో 32 అధునాతన సీసీ కెమెరాలు అమర్చామన్నారు. వీటి సహాయంతో నేరస్తులను గుర్తించడం సులభతరమవుతుందన్నారు. మాట్రిక్స్ కెమెరాలు జిల్లా కేంద్రంలోని పోలీసు కంట్రోల్ రూమ్‌తో అనుసంధానం చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలో పంచాయతీ ఎన్నికలు ఉన్నందున శాంతి భద్రతల పరిరక్షణ, గ్యాంబ్లింగ్, మట్కా నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే కదిరి హిందూపురం పోలీసు సర్కిల్ పరిధిలో గంజాయి కార్యకలాపాల నియంత్రణకు పకడ్బందీ వ్యూహంతో ముందుకు వెళుతున్నామన్నారు. ఒరిస్సా నుంచి హిందూపురం, కదిరి ప్రాంతాలకు గంజాయి కొంతమేర సరఫరా అవుతున్నట్లు సమాచారం ఉందని, పూర్తిస్థాయిలో దీనిని అరికట్టేందుకు గంజాయి విక్రేతలు, రవాణాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సరిహద్దు ప్రాంతంలో జరిగిన, జరుగుతున్న సంఘటనలపై పూర్తిస్థాయిలో ఇన్వెస్టిగేషన్ చేస్తామన్నారు. నో మట్కా... నో గ్యాంబ్లింగ్.. అనే నినాదంతో క్షేత్రస్థాయిలో నియంత్రణకు కృషి చేస్తామన్నారు. గ్యాంబ్లింగ్ ఆర్గనైజర్స్ పైన కేసులు నమోదు చేయడంతో పాటు, కౌన్సిలింగ్ కూడా ఇస్తామన్నారు. అంతేగాక జిల్లాలో అధిక వడ్డీ వ్యాపారం చేసే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇప్పటికే జిల్లాలో పాతుకుపోయిన పాత హోంగార్డులందరినీ బదిలీ చేశామని, త్వరలో ఆయా ప్రాంతాలకు కొత్త హోంగార్డులను పంపుతున్నామని వివరించారు. హోంగార్డులకు అంతర్రాష్ట్ర బదిలీలు లేనందున మానవతా దృక్పథంతో వ్యవహరిస్తున్నామని, తప్పు చేస్తే సస్పెన్షన్ వేటు వేస్తామని హెచ్చరించారు. నేరస్తులతో చేతులు కలిపే పోలీసు అధికారులను, సిబ్బందిని కూడా సస్పెండ్ చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ డీఎస్పీ నర్సింగప్ప, సిఐలు నాగేష్ బాబు ,రాజ్ కుమార్, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ముదిగుబ్బ విద్యార్థి

ప్రజాశక్తి - ముదిగుబ్బ

అనంతపురంలోని ఆర్ట్స్ కాలేజీలో జరిగిన ఎస్‌జిఎఫ్ (స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలోని అండర్- 14 హ్యాండ్‌బాల్ సెలెక్షన్ పోటీలలో, స్థానిక పివియస్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి కె. ముఖేష్ ప్రతిభ కనపర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మాట్లాడుతూ ముఖేష్ రాష్ట్ర స్థాయిలో మాత్రమే కాకుండా, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా ప్రతిభా విద్యార్థిని అభినందించాడు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - గుడిబండ

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని గుడిబండ తహశీల్దార్ శ్రీధర్ సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆధార్ సెంటర్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని ప్రజలు ఆధార్ కార్డులో చేర్పులు మార్పులు పుట్టిన తేదీ తదితర వాటిని మార్పు చేసుకోవడానికి ఈ ఆధార్ కేంద్రంలో అవకాశం ఉందన్నారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, భూ సర్వే డిప్యూటీ తహశీల్దార్ రాంభూపాల్ రెడ్డి, కొంకల్లు రాజకుమార్, మీసేవ నిర్వాహకులు హనుమంత రాయుడు, కరే లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డుకు ఈ కెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి - చెన్నేకొత్తపల్లి

ఉపాధి హామీ పథకం కింద జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ కెవైసి చేయించుకోవాలని ఎపిఒ జయమ్మత ఎలిపారు. ఈకేవైసీ చేయించుకోకపోతే జాబ్‌కార్డు తొలగిస్తారని చెప్పారు. కావున ప్రతి కూలీ తమ జాబ్‌కార్డును ఈ కెవైసి చేయించుకోవాలని కోరారు.

గుడిబండ : ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్ కార్డులు పొందిన ప్రతి కూలీ ఆయా ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా ఈ కేవైసీ చేయించుకోవాలని ఏపీఓ జగదీష్ సూచించారు. ఈ కేవైసీ చేయించుకోకపోతే ఈ పథకం కింద కూలీలు పనులు చేయడానికి అనర్హులవుతారని చెప్పారు.

శాశ్వత పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలోని సంజీవపురం ఎస్సీ కాలనీలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారం చూపాలని సిపిఐ నాయకులు ముసుగు మధు కోరారు. ఈ మేరకు ఆయన గురువారం కాలనీలో పర్యటించారు. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి నీరు నిల్వ ఉండి దాదాపు 30 కుటుంబాలకు చెందిన వారి బియ్యం, బేడలు, టీవీ తదితర వస్తువులన్నీ తడిసి ముద్దయ్యాయని కాలనీవాసులు వాపోయారు. జాతీయ రహదారి పనులు జరుగుతున్న సమయంలోనే తమకు తీవ్ర అన్యాయం జరిగిందని వివరించారు. పలు సార్లు రాస్తారోకోలు చేసినా సమస్యను ఎంపిడిఒ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని వాపోయారు. కాలనీ సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కమతం కాటమయ్య, బండల వెంకటేష్, కుళ్లాయప్ప, ఓబులేసు, గుండాల ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

అసౌకర్యాల నడుమ ముదిగుబ్బ ప్రభుత్వాసుపత్రి

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి అసౌకర్యాల నడుమ కొనసాగుతోంది. గతంలో ఉన్న ఆసుపత్రి భవనాన్ని పునర్నిర్మాణం పేరుతో తొలగించడంతో 8 ఏళ్ల నుంచి ఇరుకైన గదులలో ఆసుపత్రి నిర్వహణ జరుగుతోంది. తీవ్ర అసౌకర్యాల నడుమ రోగులు వైద్యసేవలు పొందుతున్నారు. సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న తరుణంలో అధిక సంఖ్యలో ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందక ఇబ్బంది పడుతున్నారు, ఈ పరిస్థితుల్లో గత్యంతరం లేక చాలామంది రోగులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. మండల జనాభాకు తగ్గట్టు ముదిగుబ్బలో ముప్పై పడకలు ఆస్పత్రి ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవటంలో పాలకులు, అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వినపడుతున్నాయి. ఇప్పటికైన స్పందించాలని వారు కోరుతున్నారు.

అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన

ప్రజాశక్తి-హిందూపురం

చిత్తూరు జిల్లా దేవరకొండ గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని కాల్చి ధ్వంసం చేసిన ఘటనపై గురువారం స్థానిక టిడిపి నాయకులు స్థానిక అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలిపారు. దీనికన్నా ముందు అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత విగ్రహాన్ని ధ్వంసం చేయాలని చూసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్, టిడిపి జిల్లా అధ్యక్షులు అంజనప్ప, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, టిడిపి పట్టణ అధ్యక్షులు వెంకటేష్, కౌన్సిలర్లు సతీష్ కుమార్, నాగేంద్రమ్మ, రాఘవేంద్ర, డైరెక్టర్లు పరిమళ, రామాంజనమ్మ పాల్గొన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్ పూర్తి చేయండి

ప్రజాశక్తి - బత్తలపల్లి

ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను త్వరితగతిన ఈ-క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలని వ్యవసాయాధికారులకు, రెవెన్యూ సిబ్బందిని ధర్మవరం ఆర్డీవో మహేష్ ఆదేశించారు. గురువారం మండలంలోని గంటాపురం గ్రామంలో ఈ-క్రాప్ నమోదును ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఓబిరెడ్డి, వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మానాయక్, తహశీల్దార్ స్వర్ణలత, ఏఈవో శ్రీనివాసులు, రైతు సేవ కేంద్రం అసిస్టెంట్ ఓబులమ్మ, విఆర్‌ఏ నరసింహులు, రైతులు పాల్గొన్నారు.

తపాలా సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రజల సౌకర్యార్థం తపాలా శాఖ అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రధాన తపాల కార్యాలయ పర్యవేక్షకులు విజయ్ కుమార్ సూచించారు. గురువారం ప్రపంచ తపాలా దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ 1874వ సంవత్సరం నుండి అక్టోబర్ 9వ తేదీన ప్రపంచ తపాల దినోత్సవం జరుపుకోవడం జరుగుతోందన్నారు. ఈ ఏడాది లోకల్ సర్వీసెస్ గ్లోబల్ రిచ్ గా గుర్తించడం జరిగిందన్నారు. హెడ్ పోస్టు మాస్టర్ మార్కండేయులు మాట్లాడుతూ ఈ ఏడాది నుండి పోస్టల్ సేవలు, కార్యకలాపాలపై అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

10న వికలత్వ పరిశీలన పరీక్షలు : కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

గతంలో పింఛను పొందుతూ వికలత్వ పరీక్షకు హాజరై 40 శాతం కన్న తక్కువ సర్టిఫికెట్ పొంది తదుపరి రీఅసెస్మెంట్ కొరకు నమోదు చేసుకొన్న వారికి ఈ నెల 10న జిల్లాలోని 4 ఆసుపత్రులలో వికలాంగుల వికలత్వ పున : పరిశీలన పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇకపై ప్రతివారంలో బుధ, గురు, శుక్రవారాల్లో 3 రోజులపాటు 4 ఆసుపత్రులలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇందులో మడకశిర, కదిరి, ధర్మవరం ఏరియా ఆసుపత్రులలో శారీరక వికలత్వం పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే హిందూపురం జిల్లా ఆసుపత్రిలో చూపు, వినికిడి, బుద్ధిమాంద్యం, మానసిక వికలత్వ సమస్యలపై పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో మొత్తం 5207 మంది పింఛనుదారులు రీ అసెస్మెంట్ కు దరఖాస్తు చేసుకొన్నారని వీరందరికీ సచివాలయం స్థాయిలో నోటీసులు జారీ చేశామని చెప్పారు. నోటీసులు అందుకున్న వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

రైతులపై కక్ష కట్టిన 'కూటమి' ప్రభుత్వం : వైసిపి

ప్రజాశక్తి-హిందూపురం

రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వ సంక్షేమ అంటూ గొప్పలు చెబుతూ రైతులపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టిందని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త దీపిక వేణు రెడ్డి విమర్శించారు. హిందూపురం రూరల్ మండలంలో బలవంతపు భూ సేకరణను వ్యతిరేకిస్తూ వైసిపి ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు రైతులతో కలిసి వైసిపి నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపి తహశీల్దార్ వెంకటేసుకు వినతిని అందించారు. ఈ సందర్భంగా దీపికా వేణు రెడ్డి మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్టం అనుసరించి గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించి, రైతుల సమ్మతిస్తే మార్కెట్ ధర కన్నా మూడు నుంచి నాలుగు శాతం అధికంగా ధరను రైతులకు ఇచ్చి భూమిని తీసుకోవాల్సి ఉందన్నారు. అయితే ఈ చట్టాన్ని కూటమి ప్రభుత్వం బలవంతంగా భూములను లాక్కోవడం ఎంతవరకు న్యాయమన్నారు. వెంటనే భూసేకరణ ఆపివేయాలని అన్నారు. లేనిపక్షంలో హిందూపురం రూరల్ మండలంలోని చలివెందల, రాచపల్లి, మీనకుంటపల్లి, బాలంపల్లి, చర్లపల్లి, జంగాలపల్లి, మలుగూరు, బీరేపల్లి గ్రామాల్లో ఉన్న రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు ధనాపురం వెంకటరామిరెడ్డి, వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుమతి రెడ్డి తోపాటు వైసీపీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని నిక్కంపల్లి ప్రాంతం తో పాటు నేతాజీ నగర్ ప్రాంతంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ పేర్కొన్నారు. గురువారం వార్డు పర్యటనలో భాగంగా మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునతో కలిసి ఛైర్మన్ ఆయా ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలకోవలసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ముస్తాక్, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ జి పి కే రాము, టిడిపి నాయకులు డైమండ్ బాబా, జబీవుల్లా, మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మదన్ కుమార్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పాత న్యాయస్థాన భవనాలకు మరమ్మతులు చేయించండి

ప్రజాశక్తి-హిందూపురం

న్యాయస్థాన భవన సముదాయంలో ఉన్న పాత భవన సముదాయాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వన్నేరువప్ప, రామచంద్రప్ప కోరారు. ఈ మేరకు వారి ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్రకు వినతిపత్రం అందజేశారు. సీనియర్ న్యాయవాది రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పాత న్యాయస్థాన భవనాలను వినియోగంలోకి తెస్తే కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆయా అంశాలను పరిశీలించి త్వరితగతిన భవనాలకు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాసులు, రకీబ్, అజయ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.